


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### మనిషికో స్టోరీ

**పుట్టిన ప్రతిమనిషికీ** ఓ స్టోరీ వుంటుంది. దాంట్లోవాడో, లేక ఆమో హీరో, లేదా హీరోయిన్. తన కథలో కూడా తనుకాకుండా, పక్కవాడు హీరో అయి, తను సైడ్ కిక్‌గా వుండేవాళ్ళు తక్కువ వుంటారు. వాడు, చేసే పనులు అన్నీ వాడికి పెద్దయ్యాక చెప్పుకోడానికి గొప్పలుగా ఉంటాయి.

మా సందానీని తీసుకోండి, చాలా పేద కుటుంబం, తండ్రికి ఇద్దరు భార్యలు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, పడుకోడానికి పక్కా, తినడానికి సరైన తిండీ వుండేది కాదు. అయినా చెప్పుకోడానికి బోలెడు సంగతులు.

"నేను మురికి కాలవలో చేపలు పట్టేవాడిని నా దస్తీలో.

నేను కిందపడేసిన బీడీ ముక్కలన్నీ ఏరుకుని కాల్చేవాడిని, మా అమ్మీజాన్‌కి తెలీకుండా.

ఆమె పాన్‌దాన్‌లోంచి పైసలు దొంగతనం చేసేవాడిని.

బ్లేడ్‌తో స్వరూపరాణి జడకోసినా ఎనక బెంచీలో కూర్చుని.

నేను స్కూల్ల టీచర్‌ల తోని దెబ్బలు తినని దినంలేదు.

నా మోకాళ్ళకి చెప్పులు తొడగచ్చు. నీల్‌డౌన్ చేసి చేసి ...గట్ల అయిపోయినయ్.

నా బిజిలీ అనే మేకపిల్లని పానంగా పెంచుకున్నా. బిజిలీ నా అడుగుల సప్పుడు గుర్తుపట్టి అరుస్తుండె.

ఏ.వీ రమణీ అమ్మమ్మ మడికట్టుకుని మాగాయ ముక్కలు ఎండపెడ్తే, నేను కొన్ని ముక్కలు లాగూ జేబుల దాస్కోని పరిగెత్తేవోడిని.

రంగనాధం సార్ సైకిల్ చక్రంల దినాం, గాలి తీసేసి ఆయన బడికి లేట్ వచ్చేటట్లు చేసేటోడ్ని.

హెడ్ మాస్టర్‌ని అయితే సచ్చిపోయిండని పుకార్ లేపినా.. అందరూ నమ్మేసి ఇస్కూల్‌కి శెలవు ఇచ్చేసింద్రు..."

ఇట్లా చిన్నప్పటి నాన్‌డీటైల్‌లో అశ్వత్థామ శీలం వర్ణింపుడు అంటే ఎస్సే ఆన్సర్ రాసినట్లు వాడి శీలం గురించీ, వాడి చేష్టల గురించీ సినిమా తీసేంత మేటర్ చెప్పగలడు. వాడి కబుర్ల కోసం ఎప్పుడూ చుట్టూ నలుగురు గుంపుగా వుండేవారు. వాడి కథకి వాడు హీరో. వాడి మంచిపనులు కూడా వున్నాయి. తల్లి కోసం, తోడపుట్టినవాళ్ళకోసం, చిన్నతనంలోనే శెలవల్లో సైకిల్ షాప్‌లో పనిచేసి డబ్బులు సంపాదించడం సవితి తల్లిని తండ్రి కొడ్తుంటే, అడ్డుగా వెళ్ళి, ఆ దెబ్బలు వీడు తినడం..ఇలాంటివి. వాడు పెద్దయి పిల్లలు పుట్టాక, కథలు కథలుగా తన బాల్యంలో లీలలన్ని చెప్పుకునే వుంటాడు. ఎక్కడున్నాడోగానీ.

మా స్కూల్లో ఐదవతరగతిలో టీవీ హేమమాలిని అని ఒకత్తి వుండేది. అది మేత్స్ టీచర్ సులోచనారాణిగారి అమ్మాయి. అదే దాని ప్రత్యేకత. కళ్ళనిండా పుసులు గారుతూ వచ్చేది. టీచర్ కూతురని దానికి అటూ, ఇటూ నలుగురు ఎప్పుడూ, ఏం చెపితే ఆ పని చెయ్యడానికి వుండేవారు. అందులో నేనూ ఒకదాన్ని. మన చిన్నప్పటి కథలో మనమే చెలికత్తెలుగా వుండడం, దాని గురించి మాట్లాడడం ఆశ్చర్యంగా వుందికదూ. హేమ ఎర్ర గౌన్ వేసుకొస్తే అందరూ "నువ్వు వాణిశ్రీలా వున్నావ్" అనేవారు. వాణిశ్రీ అంత పొట్టి ఎర్రగౌను ఎందులో వేసుకుందో? సులోచనా టీచర్ పాపం పొట్టిగా నల్లగా అమ్మవారి మచ్చలతో వుండేవారు.

హేమతో మిగతావాళ్ళు "సులోచనా టీచర్ అచ్చు సినిమాల్లో సావిత్రిలా వుంటుంది" అని ఉబ్బేసేవారు. అమ్మ ఎలా వున్నా బానే వుంటుంది. కానీ మిగతా వాళ్ళు అతిగా పొగుడుతుంటే "అబద్దం సావిత్రి ఇలా వుండదు" అని అరిచి చెప్పాలనిపించేది. పైగా ఆవిడ మా తొడమీద కండ వూడివచ్చేట్లు తొడపాశాలు పెట్టేది. చీటికీ మాటికీ పెద్ద బెత్తంతో కొట్టేది. వాళ్ళ అమ్మాయి అల్లరిచేసినా, హోం వర్క్ వెయ్యకపోయినా ఏమీ అనేదికాదు. క్లాస్‌లో కొంచెం అందంగా వున్న పిల్లల్ని చూస్తే తెగ కొట్టేది. అందుకే ఆవిడ నాకు అస్సలు బాగుండేది కాదు. క్రీస్తుమణీ టీచర్ దేవతలా కనిపించేది. ఎందుకంటే ఆవిడ డ్రాయింగ్ టీచర్ అయినా, కథలు చెప్పేది. చిరునవ్వుతో మాతో మాట్లాడేది. ఆ వయసులో అలా వుంటే అందంగా కనిపించేవారు.

హేమమాలిని "మా తాతగారు జమిందారు. పెద్ద మామిడితోట వుంది, గంపల కొద్దీ మావిడి పండ్లు పంపిస్తారు. నాకు పుట్టిన రోజుకి పట్టు పరికిణీ కుట్టిస్తుంది మా అమ్మ. శెలవల్లో మేం బొంబాయి వెళ్ళాం. ట్రాంలో తిరిగాం. మా మావయ్యకి పడవంత కారు వుంది" ఇలా ఎన్నెన్నో గొప్పలు చెప్తుంటే, వినోలియా దానికి పుస్తకంలో పేపర్ పర్‌ర్‌న చింపి, విసినికర్ర చేసి విసిరేది. సందానీగాడు బ్లేడ్‌తో కోసి మావిడికాయ ముక్కలు ఉప్పు అద్ది నోటికి అందించేవాడు. వాడిచేతిలో విష్ణు చక్రంలా ఎప్పుడూ బ్లేడ్ వుండేది. దాంతో ఎన్నో పనులు చేసేవాడు.

సులోచనా టీచర్ మమ్మల్ని "లెక్కలు రాకపోతే నాలుగిళ్ళల్లో అంట్లు తోముకుంటారే వీధులు వూడ్చుకుంటారు" అని తిట్టేది. పెద్దయ్యాక ఓసారి హేమమాలిని చాలా దయనీయమైన స్థితిలో నాకు కనిపించి "ఏదైనా పని వుంటే చెప్పు.. ఆయా

పని అయినా.." అంది. మనసంతా పాడైపోయింది. వాళ్ళ అమ్మ వున్నప్పుడు దాన్ని నిజంగానే రాజకుమార్తిలా చూసింది. అది పదోక్లాస్‌లో మేం ఎక్స్‌కర్షన్‌కి వెళ్తే, క్రిస్టఫర్‌గాడితో, చేతులు పట్టుకుని డ్యూయెట్లు పాడ్తూ, నీళ్ళల్లో పడిపోతే, నానా కష్టం అయింది పైకి తీయడం. ఆ తర్వాత ఇంటర్ మీడియెట్ ఫెయిల్ అయి ఆ క్రిస్టోఫర్‌తోనే పారిపోయిందని విన్నాను.

మా అందరినీ, చర్మం వూడేట్లు కొట్టి, బుద్ధి చెప్పాలనుకున్న సులోచనా టీచర్, దాన్నీ ఒకసారైనా అదుపులో పెడితే.. ఇలా నాకు మా స్టూడియో బయట చిరుగుల చీరలో కనపడేదికాదు. అఫ్‌కోర్స్ దానికి పని చూసాను. ఇప్పుడు బాగానే వుంది.(అసలు పేరు ఇది కాదు అనుకోండి)

ఇట్లా చిన్నప్పుడు ఒక గ్యాంగ్‌ని వెంటేసుకుని తిరుగుతూ, పోరంబోకు పనులు చేసేవారు చాలామంది, రౌడీలుగా వుండేవారు, బుద్ధిగా అయి సాదాసీదాగా ఎక్కడో మర్యాదగా ఉద్యోగం చేసుకుంటూ వుంటారు. కొందరు అతి మంచి బాలుడిలా నున్నగా నూనె రాసుకుని దువ్వుకుని, సార్ రాగానే బెత్తం అందించి, బ్లాక్ బోర్డ్ డస్టర్‌తో నిగనిగా తుడిచేసి వీలైతే సార్ బట్టతలకి కూడా నూనె రాసి నిగనిగా తుడిచేసి, ఆయన చెక్కకుర్చీ తన చొక్కాతో తుడిచేసి, ఆయనలేనప్పుడు అందరిమీదా అజమాయిషీ చేసి, మానిటరింగ్ చేసి, బుద్ధిగా కనిపించేవాళ్ళు, కొత్తదాసులుగా మారి పెద్దయ్యాక, లాండ్ దందాలు సెటిల్ చేస్తూ వుండివుండొచ్చు. ఏమైనా కావచ్చు. ఎటైనా మారచ్చు జీవితాలు.

స్క్రీన్ ప్లేలో మనం పెరిగి పెద్దవుతూంటే, మనకి కనిపించని కేరెక్టర్ ఒకటి మన వెంటే  అంటి పెట్టుకుని వుంటుంది. అదే విధి. ఒక్కోసారి సడెన్ సర్‌ప్రైజ్‌లు ఇస్తూ వుంటుంది. పేపర్‌లో అతి పెద్ద కుంభకోణం చేసి రెండొందల కోట్లు స్కాం చేసిన సంజయ్ మాల్యా అన్న పేరు, ఫోటో చూసి "అరె వీడు మా క్లాసులో సన్యాసిరావ్ కదూ" అని మనం  గుర్తు పట్టెయ్యచ్చు.. నిలువెత్తు హోర్డింగ్‌లో, పాలాభిషేకాలు చేస్తున్న హీరో పోస్టర్‌ని చూసి "వీడు మా పాలు పోసే నర్సిమ్ములు కొడుకు యాదిగాడు" అని మనం విస్తుపోవచ్చు.

అలాగే నేను నిర్మాలానంద బాబా ఆశ్రమానికి వెళ్ళి, ఆ బాబానీ, పక్కనున్న మాతాజీని చూసి గుర్తు పట్టేసి "ఈయన మా తెలుగు మాస్టారు ప్రసాదరావుగారు, ఆ మాతజీ మా పక్క స్కూల్‌లో కుట్టు టీచర్ శీలవతి, ఈయన పెళ్ళిచేసుకున్న కుసుమకుమారి టీచర్‌నీ, ఐదుగురు పిల్లల్నీ వదిలేసి వచ్చి, బాబాగా మారి ఇక్కడ శీలవతి మాతాజీతో ఆశ్రమ జీవితంలో ఎకరాలు ఎకరాలు మావిడితోట కబ్జా చేశాడు ఆశ్రమం పేరిట" అని మా అమ్మతో చెప్పాను.

"తప్పు కళ్ళు పోతాయి" అని చెంపలు వేసుకుంది అమ్మ.

"మీరు మా ప్రసాదరావు మాస్టారు కదూ" అంటే ఆయన నన్ను గుర్తుపట్టి కళవెళ పడ్డాడు. ఎందుకు గుర్తుపట్టడూ? నోట్స్‌లు కరెక్షన్ వంకతో ఆడపిల్లలని దగ్గరగా చూస్తూ, కాళ్ళు తొక్కడం, బుగ్గలు గిల్లడం చేసేవాడు మా ఏడోతరగతిలోనే. అలాంటి చరిత్ర ఆయనది.

"బాబాగారు మౌన ముద్రలోకి వెళ్ళే టైం అయింది ఇంక వెళ్ళి రండి " అంది శీలవతి.

"మీరూ తెలుసు మేడం. మీరు పాపం డ్రిల్లు మాస్టర్ బాబూరావ్ సార్ పెళ్ళాం కదూ" అన్నాను.

మొహం ముటముటా పెట్టుకుని "సాధు సన్యాసినుల పూర్వాశ్రమం గురించి మాట్లాడకూడదు" అంది.

"పూర్వాశ్రమంలో రేకుల ఇల్లు. ఈ ఆశ్రమం బావుందిగా ఫైవ్ స్టార్ హోటల్‌లా. ఏ.సీలూ, పాలరాతి ఫ్లోరింగ్.." అన్నాను.

ఆవిడ ఆయన చెయ్యిపట్టుకుని లాగి మరి తీసుకుపోయింది. విసినికర్రతో పక్కన నిలబడ్డ శిష్యులు, మమ్మల్ని ఆల్‌మోస్ట్ బయటకి తోసారు.

విధి చేయు వింతలెన్నో కదా!

అసలు ప్రతివాడికీ ఓ స్టోరీ. దానిని పదిమందితో గ్లోరిఫై చేసి చెప్పుకోవాలనే కోరికా చిన్నప్పటి నుండీ వుంటుంది. కానీ దేశనాయకులకో, సినిమా ఏక్టర్లకో, క్రికెట్ ప్లేయర్‌లకో, ఇంకా ప్రతిభావంతమైన కళాకారులకో, తమ హీరోయిజం గురించి గొప్పలు చెపుకోడానికి ఇంటర్వ్యూలలో ఆస్కారం దొరికేది. కానీ ప్రస్తుత పరిస్థితులలో ఫేస్‌బుక్‌లూ, యూ ట్యూబ్‌లూ వచ్చాక ప్రతివాడికీ, ఒక వ్లాగో, బ్లాగో తెరిచి, తన గొప్పలు చెప్పుకోడానికి అవకాశం వచ్చింది.

ఈ మధ్య నేనొకతని వ్లాగ్ చూసాను యూట్యూబ్‌లో. పాటలు రాసి రాప్ సాంగ్స్ తన ఫ్రెండ్‌తో కలిసి పాడుతున్నాడు. ఆ పాటలనిండా బూతులు. ఎవరో బూతులు అభ్యంతరకరంగా వున్నాయి అంటే "క్షమించండి బ్రో.. బూతులు లేకుండా మా అమ్మా నాయినా తోటికూడా మాట్లాడలేను" అని సిన్సియర్‌గా జవాబిచ్చాడు ఆ కామెంట్‌కి.

ఆ అమ్మానాన్నలు ఇచ్చిన జన్మ సంస్కారానికి ప్రణామాలు. వ్లాగ్ స్టార్ట్ చేసినప్పటినుండీ అతనూ, అతని ఫ్రెండ్ కలసి తాగుతూ వుంటారు. బీర్ బాటిల్ మధ్య మధ్యలో ఐదేళ్ళ తన కొడుకు నోటి దగ్గర దాకా తీసుకెళ్ళి, "వద్దురా.. ఎదగడానికి ఎందుకురా తొందరా? ఇంకో పన్నెండేళ్ళు పోతే ఎట్లాగో తాగాల్సిందే" అని నవ్వుతాడు. పెళ్ళాం కూడా నవ్వుతుంది. ఆమె కూడా సాఫ్ట్ వేర్ ఇంజనీర్. అతను కూడా ఇంజనీర్ అమెరికాలో. అతని తల్లి ఆమ్లెట్, లేదా చికెన్ ఫ్రై చేసి అందిస్తూ వుంటుంది. అతనూ తన చిన్నతనంలో చేసిన హీరోయిక్ ఏక్ట్‌ల గురించి చెప్తూ వుంటాడు.

దొంగతనాలూ, అబద్ధాలు ఎట్లా చెప్పి తండ్రి దగ్గర డబ్బులు తీసుకునేవాడూ, అమ్మాయిలని ఎలా ఏడిపించేవాడూలాంటివి. ఇలా చెప్పుకోడానికి ప్రతి పనికిరానివాడికీ సోషల్ మీడియా ఒక వేదికిచ్చింది. ఏదైనా మాట్లాడొచ్చు, ఏమైనా చెయ్యొచ్చు. వాడింట్లో మందుపార్టీలు, మాడిపోయిన అట్లూ, పెళ్ళాం తిట్లూ. .. కావేవీ సోషల్ మీడియాకి అనర్హం.

నాకు ఒక కోరిక. ఈ యూట్యూబ్ దాంట్లో అప్‌లోడ్ చేసే ప్రతి వీడియోకీ కనీసం పది డాలర్లు చెల్లించాలనే రూలు పెట్టాలని. అప్పుడైనా సగానికి సగం మంది చెత్త పెట్టేవాళ్ళు కంట్రోల్ అవుతారు.

'ఇక లేరు' అనేది ఛానెల్ పేరుట. పొద్దున్నే 'పవన్ కళ్యాణ్ ఇక లేరు, జయసుధ ఇకలేరు', అని వ్యూస్ సంపాదించడానికి పెట్టే పనికి రాని వాళ్ళు కంట్రోల్ అవుతారు.

ఇట్లా ప్రతివాడికీ ఓ స్టోరీ.. దానికి వాడు హీరో.. ఖర్మకాలి చూసే మనం.. ఇది ఈ దశాబ్దంలో సాధించిన ప్రగతి.

Post your comments







